
నార్సింగి ఖానాపూర్ లడ్డూను రూ. 14.26 లక్షలకు కైవసం చేసుకున్న మస్కూరి శంకరయ్య


అలకాపూర్ ఎంజీ పార్కులో రూ. 8.11 లక్షలకు కస్తూరి రాములు


మణికొండ నవజ్యోతి యూత్ లడ్డూను రూ. 7.50 లక్షలకు కుంట్లూరు గోపాల్‌రెడ్డి


మణికొండ గార్డెన్‌లో రూ. 2.26 లక్షలకు నిమ్మల మౌనిక, వంశీ

లడ్డూలు.. రికార్డులు!

పోటాపోటీగా లడ్డూల వేలంపాటలు

మణికొండ, శంషాబాద్: వినాయకుడి చేతుల్లో 11 రోజుల పాటు పూజలందుకున్న లడ్డూల ధరలు రికార్డులను బ్రేక్ చేశాయి. శనివారం అర్ధ రాత్రి వరకు జరిగిన లడ్డూల వేలం పాటల్లో వందలాదిగా భక్తులో పోటాపోటీగా పాల్గొని రూ. లక్షల్లో పాడి లడ్డూను దక్కించుకున్నారు. సాయంత్రమే వినాయకులను నిమజ్జనాలకు తరలించేందుకు ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నా లడ్డూల వేలం పాటలకు సమయం ఎక్కువ తీసుకోవటంతో రాత్రి 10 గంటల తరువాతనే ఎక్కువ వినాయకులు నిమజ్జనాలకు కదిలాయి. వినాయకుడి చేతుల్లోని లడ్డూలను కైవసం చేసుకుంటే తాము చేసే పనుల్లో విఘ్నాలు తొలగి, విజయాలు చేకూరుస్తాయనే నమ్మకంతో వాటిని కొనుగోలు చేశారు. వాటిని పొందలేని వారు వచ్చే సంవత్సరం తిరిగి ప్రయత్నిద్దామని మిన్నకున్నారు. లడ్డూలను దక్కించుకున్న వారు ఆదివారం వాటిని తమ గృహాల్లో ఉంచి సోమవారం నుంచి బంధు, మిత్రులకు పంపిణీ చేయటం, పొలాలు ఉన్న వారు వాటిల్లో కొంత చల్లి, వ్యాపార సంస్థలు, స్థలాలలో ఉంచుతామని పేర్కొంటున్నారు.


గండిపేట వినాయకుడి లడ్డూని రూ. 5.04 లక్షలకు గోపాల అమరేందర్


అలకాపూర్ పీవీఎస్ అకాడమీలో రూ. 4 లక్షలకు సాయిరాం బ్రదర్స్


దుర్గాహిల్స్‌లో రూ. 1.17 లక్షలకు రాములుగుప్తా


మణికొండ శివాజీనగర్‌లో రూ. 1.51 లక్షలకు వినయ్‌కుమార్


మణికొండ యాంబియాన్స్ కోర్ట్ యార్డ్ జీ బ్లాక్‌లో రూ. 10.05 లక్షలకు శశి, హేమంత్ బృందం


తొండుపల్లి పోచమ్మ గణేశ్ లడ్డూను రూ. 1.47 లక్షలకు మాజీ కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్


నార్సింగి శాంభవి భక్త సమాజంలో రూ. 7.61 లక్షలకు కొల్లూరు దీపు ముదిరాజ్


మణికొండ కేపీఆర్ కాలనీలో రూ. 4.01 లక్షలకు వివేక్‌రెడ్డి


మణికొండ శివపురి కాలనీలో రూ. 2.20 లక్షలకు మహేష్‌గౌడ్


శంషాబాద్ సాతంరాయిలో చౌరస్తా రూ. 1.61 లక్షలకు తోట రామకృష్ణారెడ్డి


అత్తాపూర్‌లో రూ. 12.51 గుమ్మడి బ్రదర్స్ భూపాల్‌రెడ్డి


హైదర్‌గూడలో రూ. 1.70 లక్షలకు చీరాల శ్యామ్

నాలాల్లో మట్టిని తొలగించిన హైడ్రా

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు, వాహనాదారులు పడుతున్న ఇబ్బందులను తొలగించి శాశ్వత పరిష్కారాలు చూపించడం జరిగిందని ఎస్ఎఫ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో నాలాల్లో పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులను తొలగించే పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరాంఘర్ చౌరస్తా రైల్వే బ్రిడ్జి కింద మేజర్ వాటర్ గోయింట్ పాయింట్ కింద కొన్ని సంవత్సరాలుగా నాలాలలో పూర్తిగా మట్టి పేరుకుపోవడం కారణంగా అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి కింద చిన్నపాటి వర్షానికి కూడా వాహనదారులు ఇబ్బందులు పడుతుండే వారన్నారు. దీంతో గత నెల హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య, ఏడీఎఫ్‌వో యజ్ఞ నారాయణ, ఎస్ఎఫ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలిఈంచి మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం హైడ్రా బృందాలను ఏర్పాటు చేశారన్నారు. నాలాలలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. వర్షం వస్తే వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా శాశ్వత మార్గం మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం హైడ్రా నిరంతరం పర్యవేక్షిస్తూ ఇక్కడ పరిస్థితులు ఆరా తీశారన్నారు. నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని ఆదేశించారన్నారు. గత నెలలో ఐదు సెంటీమీటర్లు వర్షానికి ట్రాఫిక్ జామ్ భారీగా ఏర్పడింది, మొన్న 10 సెంటీమీటర్ల వర్షం పడినా కానీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం హైడ్రా వాహనాదారులకు, క్లియర్ చేశారు. హైడ్రా మార్షల్ రాములు, సూపర్‌వైజర్ల బృందంతో రాజేంద్రనగర్, శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ల టీమ్స్ కలిసి కొన్ని సంవత్సరాలుగా నాలాలలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తూ ప్రజలకు మోక్షం కలిగేలాగా చేశారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ హైడ్రా రాజేంద్రనగర్ సర్కిల్ నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నాలాల్లో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

అందరి సహకారంతోనే నవరాత్రి ఉత్సవాలు విజయవంతం

- అధికారుల సహకారం అభినందనీయం
- భాగ్యనగర్ గణేశ్ సమితి ప్రధాన కార్యదర్శి శ్రీధర్



రాజేంద్రనగర్: అందరి సహకారంతోనే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయని... నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా పూర్తయిందని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెల రోజులకు పైగా ఏర్పాట్ల కోసం శ్రమించిన జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్, పోలీసు, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, వాటర్స్ వర్క్స్, హెల్త్, ఐఅండ్‌పీఆర్, శానిటేషన్ తదితర అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సర్కిల్ పరిధిలో గణేశ్ ఉత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నిర్వహించడంలో అధికారులు చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పత్తికుంట, పల్లె చెరువు వంటి ప్రధాన చెరువులతో పాటు ఇతర ప్రాంతాలలో నిమజ్జన ఏర్పాట్లను అధికారులు నిర్వహించడంలో సఫలీకృతం అయ్యారన్నారు. సర్కిల్ జల మండలి, విద్యుత్, రెవెన్యూ, పోలీసు వంటి ప్రధాన శాఖలతో ఇతర అధికారులు సైతం పూర్తి సహకారం అందించారన్నారు.

కార్వాన్‌లో ఎంపీ పర్యటన

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ డివిజన్‌లో ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదివారం పర్యటించారు. జీఎంకే ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఫిల్లింగ్ స్టేషన్ అధినేత పాషాభాయ్, షకీల్ ఆలీఖాన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కులమతాలతో తమ పార్టీకి సంబంధం లేదని ప్రజా సేవ చేయడమే తమ ప్రథమ లక్ష్యమన్నారు. పార్టీలో దళితులు, బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ వస్తున్నామన్నారు. అలాగే యువ వ్యాపారవేత్త జీఎంకే ఫిల్లింగ్ స్టేషన్‌కు చెందిన షకీల్ అలీఖాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు ఉన్నారు.


ఎంపీ అసదుద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పార్కులో దీపాలు ఏర్పాటు చేయాలి

అత్తాపూర్: పెద్దతాళ్లకుంట పార్కులో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులతో పాటు పలుమార్లు ఎలక్ట్రిసిటీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం పండుగ సందర్భాలలో మాత్రమే కళ్లు జిగేల్ మనిపించే విధంగా విద్యుత్ కాంతులు విరజిమే విధంగా నగరం పరిసర ప్రాంతాలు వెలిగిపోతున్నాయి. గత 40 రోజులుగా పార్కులో ఏ ఒక్క లైటు వేలగకపోవడంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. పాడైన లైటింగ్ స్థానంలో నూతనంగా లైటింగ్ వ్యవస్థను ఆధునికరించాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పరిశ్రమలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలివీ... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లో పెట్ బాటిల్ అండ్ స్క్రాప్ మెటీరియల్స్ పరిశ్రమ ఉంది. రోజూ మాదిరిగానే శనివారం రాత్రి కంపెనీని మూసి కార్మికులు వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపించింది. స్థానికులు విషయాన్ని రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో స్టేషన్ ఆఫీసర్ చంద్రనాయక్ నేతృత్వంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రమాద సమయంలో కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేనా క్లీనిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ఆనంద్‌నగర్‌లో కొత్తగా నెలకొల్పిన రేనా క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యుసిడి ల్యాబ్స్ అధినేత రవీందర్‌గౌడ్, ల్యాబ్ టెక్నిషియన్లు రమేష్, అల్లమస్, సునీల్, సంగీత, పూజలు ఆనంద్‌నగర్, ధాత్రి కాలనీ వాసులు రక్త పరీక్ష, మధుమేహం, థైరాయిడ్ వంటి ఆరోగ్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా రోగులను పరీక్షించి తగు చికిత్స చేశారు. ఆనంద్‌నగర్ కాలనీ వాసులతో పాటు ధాత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండా ఆనందరెడ్డి, వి.భాస్కర్ రెడ్డి, గాజుల చంద్రశేఖర్, కె.చంద్రశేఖరరెడ్డి, సీనియర్ సిటిజన్లు కొంపెల్ల కామేశ్వరరావు, ఎస్.రామలింగం, ఉలిగేశ్వర్, టి.శంకర్, ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తెలంగాణలో ప్రజా రంజక పాలన

గోల్కొండ: తెలంగాణలో ప్రజా రంజకంగా పాలన సాగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ మిత్ర కృష్ణ ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందించారు. టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ ముందుకెళ్తున్నారన్నారు. మరోవైపు మహిళా సాధికారత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.



అంతర్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మణికొండ: అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు హైదరాబాద్ జిల్లా క్రీడాకారులను మణికొండలో ఆదివారం ఎంపిక చేశారు. జనగామ జిల్లాలో ఈ నెల 13, 14వ తేదీలలో జరిగే పోటీలలో పాల్గొనే బాల, బాలికల జట్లకు పోటీలు నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ జయశంకర్ పార్కులో మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో జరిగిన పోటీలలో హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు టి. మహేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌ప్రసాద్, కోశాధికారి గౌరీశంకర్, స్థానిక అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రహణంతో ఆలయాల మూసివేత.!

సంప్రోక్షణ అనంతరం దర్శనానికి అనుమతి

గచ్చిబౌలి: సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆలయాలన్నీ మూతపడ్డాయి. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ఆలయాలన్నింటిలో ఆదివారం మధ్యాహ్నం తర్వాత కొన్ని, సాయంత్రం మరికొన్ని ఆలయాలను మూసేశారు. అర్చకులు గర్భగుళ్లకు తాళం వేయడంతో పాటు ఆలయ ప్రధాన ద్వారానికి కూడా తాళం వేశారు. సోమవారం ఉదయం మళ్లీ ఆలయాలను తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి ఆ తర్వాత దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ఆ తర్వాత అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

ఫార్మా ఆవిష్కరణల్లో హైదరాబాద్ కీలకం

రాయదుర్గం: ఫార్మా ఆవిష్కరణల్లో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషిస్తోందని హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్వాల దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫార్మా లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2025 కార్యక్రమం ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,.. మేనేజ్‌మెంట్ ఎక్స్‌లెన్స్‌కు మార్గదర్శకంగా హైదరాబాద్ మారుతోందన్నారు. వ్యాక్సిన్ డిప్లొమసీ, ఫార్మారంగంలో నూతన ఆవిష్కరణలో హైదరాబాద్ ఫార్మా ప్రముఖమన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా, నాట్కోఫార్మా మాజీ డైరెక్టర్ అనుప్ అన్విత్ చౌదరి, డాక్టర రెడ్డీస్‌ల్యాబ్స్ ప్రతినిధి అనుప్‌అవిజిత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జన సంబురం

- పటిష్ట భద్రత కల్పించిన పోలీసులు
- ప్రమాదాలను నివారించిన విద్యుత్ సిబ్బంది
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ అధికారులు
- ఆనందోత్సవాల్లో గణేశ్ మండపాల నిర్వాహకులు


శంషాబాద్ కామని చెరువు వద్ద నిమజ్జనాలను పరిశీలిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతి

మణికొండ: వినాయక చవితి ఉత్సవాలతో పాటు నిమజ్జనాలు ప్రశాతంగా ముగిశాయి. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలు ఆదివారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని చెరువులలో వేసే వినాయకులను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. రాజేంద్రనగర్ పల్లెచెరువు, శంషాబాద్ కామని చెరువు, కోకాపేట కొత్త చెరువు, నెక్నాంపూర్ చిన్న చెరువులలో వందలాది వినాయకులను నిమజ్జనం చేశారు. మరికొన్ని పెద్ద వినాయకులు నగరంలోని హుస్సేన్‌సాగర్‌కు వెళ్లగా అప్పటికే అక్కడ అనేక వినాయకులు క్యూలో ఉండటంతో ఆదివారం మధ్యాహ్నం వరకు నిమజ్జనాలను చేశారు. వినాయకులకు విద్యుత్ తీగలు తగిలి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సిబ్బంది వాటితో పాటు ఊరేగింపులో పాల్గొన్నారు. కిందకు ఉన్న విద్యుత్ వైర్లను వారే పైకి లేపి వినాయకులను ముందుకు తీసుకుని వెళ్లారు. కొన్ని కాలనీలలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేసి ప్రమాదాలను నివారించారు. పోలీసులు వినాయకుల వెంట ఉండటంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించటం, నిమజ్జన సాగర్‌ల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ అధికారులు చెరువుల వద్ద క్రేన్‌లను ఏర్పాటు చేసి పనులను పర్యవేక్షించారు.

- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతి శనివారం అర్ధరాత్రి శంషాబాద్ కామని చెరువు వద్ద కొనసాగుతున్న నిమజ్జనాలను పరిశీలించారు. మొత్తం మీద వినాయక ఉత్సవాలు, నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసిపోవటంతో నిర్వాహకులతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.


అలకాపూర్ ఎస్‌వీపీ పార్కు గణేశ్ ఊరేగింపులో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


మణికొండలో విద్యుత్ వైర్లను తప్పించిన సిబ్బంది